సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 7 । మే । 2025



సోమశిలలో 50.706 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 50.706 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 110 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,006
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,075
3 శాతం జీఎస్టీతో	రూ.9,347
నవర (8 గ్రా)	రూ.74,776

గరిష్టం/కనిష్టం
39.6 /27.8

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. మంగళవారం గాలో తేమ 64 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

డీసీపల్లిలో 460 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి వేలం కేంద్రంలో మంగళవారం 460 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 706 బేళ్లు రాగా 460 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 58431.5 కిలోల పొగాకును విక్రయించగా రూ.14903359.30 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్ట ధర రూ.280 కాగా కనిష్ట ధర రూ.210 లభించింది. సగటు ధర రూ.255.06 నమోదైంది. వేలంలో 13 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

పొదలకూరు పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

నెల్లూరు (పొగతోట): కోర్టుకు సరైన సమాధానం ఇవ్వకుండా తప్పుదారి పట్టించే విధంగా సమాచారం ఇచ్చిన పొదలకూరు పంచాయతీ కార్యదర్శి వి.శీనయ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పొదలకూరు పంచాయతీలో భూముల విషయాలకు సంబంధించి కోర్టును తప్పుదోవ పట్టించే విధంగా విధుల్లో పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ విషయంపై ఫిర్యాదులు అందడంతో స్పందించిన కలెక్టర్ సస్పెండ్ చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

చెక్ పవర్ రద్దు

నెల్లూరు (పొగతోట): వింజమూరు మండలం కాటేపల్లి సర్పంచ్ విజయలక్ష్మమ్మ నిధుల దుర్వినియోగానికి సంబంధించి చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు డీపీఓ శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అందిన ఫిర్యాదు మేరకు రీజినల్ పంచాయతీ అధికారి విచారణ చేశారు. విచారణలో సాధారణ నిధులు రూ.2,49,311 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2,29,519 మొత్తం రూ.4,78,830 దుర్వినియోగం అయినట్లు తేలింది. వీటితోపాటు రూ.13,58,583 నిధులు నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేశారని, అవి కాకుండా రూ.14,87,482 నిధులు గ్రామ అభివృద్ధికి ఖర్చు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రభుత్వానికి సరెండర్ చేసుకోవాల్సిన పరిస్థితి సర్పంచ్ కల్పించారన్నారు. వీటన్నింటికి సర్పంచ్ బాధ్యులు కావడంతో చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు సోమశిల నుంచి నీటి విడుదలకు సన్నాహాలు

సోమశిల: జిల్లాలో ఖరీఫ్ (రెండో పంట) సాగుకు అవసరమైన నీటి విడుదలపై ఇటీవల జరిగిన ఐఏబీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు బుధవారం నీరు విడుదల చేస్తామని జలాశయం అధికారులు మంగళవారం తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ వేలూరి కేశవ సోమశిల జలాశయం వద్ద సాగునీటిని విడుదల చేస్తారని, నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని అధికారులు తెలిపారు. వాస్తవానికి సోమవారమే నీటిని విడుదల చేయాల్సి ఉంది. అయితే సోమశిల అధికారులకు నీటి విడుదలకు సంబంధించి ఇండెంట్ ఇవ్వకపోవడం, మంత్రి ఆనం అందుబాబులో లేకపోవడంతో రెండు రోజుల ఆలస్యంగా ఈ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

నల్ల మాస్కులు ధరించి మౌన నిరసన



నల్ల మాస్కులు ధరించి నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

నెల్లూరు (అర్బన్): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని సీహెచ్‌ఓలు నగరంలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో చేస్తున్న సమ్మె మంగళవారానికి 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీహెచ్‌ఓలు ముఖానికి నల్ల మాస్కులు ధరించి మౌనంగా నిరసన తెలిపారు. అనంతరం సీహెచ్‌ఓల అసోసియేషన్ భానుమహేష్ మాట్లాడుతూ తాము న్యాయమైన సమస్యలు తీర్చాలని అడిగితే ప్రభుత్వంలోని పెద్దలు మీరు బాండ్ రాసిచ్చారు. జాగ్రత్త అంటూ తమను హెచ్చరించడం న్యాయం కాదన్నారు. బాండ్ అంటే ఉద్యోగానికి కనీస భద్రత ఉండాలన్నారు. భయం కాదన్నారు. తమ నోరు నొక్కుతూ ఇన్‌సెంటివ్స్ కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. పెండింగ్ బకాయిలు, విలేజ్ హెల్త్ క్లినిక్ అద్దెలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనాలు పెంచాలని కోరారు. ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి మాట్లాడకపోతే శాంతియుతంగా నిరాహార దీక్షలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ ఆదిల్, కార్యదర్శి రెబకా, సౌమ్య, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

రూ.11 వేల కోట్ల భారీ కుంభకోణం

ఇది దేశంలోనే అతిపెద్ద స్కాం

- ఇసుకతో ప్రారంభమై.. కరెంట్ దాక..
- 11 నెలల్లో అప్పుల ఆంధ్రప్రదేశ్
- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలతో శాంతిభద్రతలకు విఘాతం
- ఇవన్నీ ప్రశ్నిస్తున్నారనే వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు
- ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరుసిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి

నెల్లూరు (పొగతోట): భారతదేశంలోనే అతిపెద్ద స్కాంకు కూటమి ప్రభుత్వం తెర తీసిందని, విద్యుత్ కొనుగోళ్లల్లో రూ.11 వేల కోట్ల భారీ కుంభకోణానికి రంగం సిద్ధం చేసిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కుంభకోణాల పాలన సాగుతుందని, 11 నెలల్లో అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారని ధ్వజమెత్తారు. రోజుకొక కుంభకోణం వెలుగుచూస్తుందన్నారు. మొన్న విశాఖపట్నంలో ఉర్సా భూకుంభకోణం బయటకు వస్తే.. నిన్న కుట్టుమెషిన్ల కుంభకోణం వెలుగుచూసిందన్నారు. తాజాగా రాష్ట్ర ప్రజలపై మరో పాతికేళ్లు విద్యుత్ చార్జీల భారం వేసే విధంగా రూ.11 వేల కోట్ల కుంభాకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. టీడీపీ నేతలు అధికారం చేపట్టిన నాటి నుంచి వరుస స్కామ్‌లతో దోచుకోవడం మొదలెట్టారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయమని వైఎస్సార్‌సీపీ నేతలు నిలదీస్తుంటే.. అవినీతిని ప్రశ్నిస్తుంటే కేసులతో గొంతు నొక్కేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ల్యాండ్, ఇసుక, లిక్కర్, సిలికాను అడ్డగోలుగా దోచుకుంటూ రూ.వేల కోట్ల అక్రమార్జనే ధ్యేయంగా చెలరేగిపోతున్నారని మండి పడ్డారు.

ప్రజలపై పాతికేళ్ల పాటు బిల్లుల భారం

విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించి మే 2వ తేదీ ఏపీ విద్యుత్ శాఖ అధికారులు యాక్సిస్ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందంతో ఈ అవినీతికి బీజమేసిందన్నారు. 25 ఏళ్ల పాటు రూ.4.60లకు విద్యుత్ కొనుగోలు చేసే విధంగా ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఈ ఒప్పందాన్ని విద్యుత్ సంస్థలు ఎక్కడ వ్యతిరేకిస్తాయోనని 108 సెక్షన్‌ను తీసుకువచ్చి కచ్చితంగా అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. దీంతో రాబోయే రోజుల్లో విద్యుత్ చార్జీలు ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలని లక్ష్యంతో 7000 మెగావాట్ల విద్యుత్‌ను కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీ వద్ద రూ.2.49 పైసలు అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి 25 ఏళ్లకు అగ్రిమెంట్ కుదుర్చుకుందని గుర్తు చేశారు. అయితే దీనిపై రూ.లక్ష కోట్ల కుంభకోణమంటూ టీడీపీ నేతలు విష ప్రచారం చేశారన్నారు. ప్రభుత్వంలోకి రాకముందు చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామని చెప్పి నేడు ప్రజల మీదే భారం మోపుతున్నారన్నారు. పేదలపై విద్యుత్ సర్‌చార్జీల పేరుతో ఇప్పటికే రూ.15 వేల కోట్ల వసులు చేస్తున్నారని మండి పడ్డారు. రూ.5 వేలు విద్యుత్ బిల్లు వచ్చే వారికి రూ.8 వేల బిల్లు వస్తుందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో డిస్కంలు రూ.86 వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.29 వేల కోట్లకు తగ్గించిందన్నారు. విద్యుత్ డిస్కంలు నష్టాల్లో ఉంటే జగన్‌మోహన్‌రెడ్డి రూ.47,800 కోట్లు చెల్లించి వాటిని ఆదుకున్నారని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వం డిస్కమ్‌లకు కేవలం రూ.13,250 కోట్లు మాత్రమే చెల్లించిందన్నారు. రైతులకు సంబంధించి రూ.8,840 కోట్ల విద్యుత్ బకాయిలను సైతం టీడీపీ ప్రభుత్వం వదిలేస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చెల్లించినట్లు వివరించారు.

ఇసుక నుంచి ప్రారంభం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 80 లక్షల టన్నుల ఇసుక స్టాక్ చేస్తే.. కూటమి ప్రభుత్వ నేతలు దాన్నంతా దోచుకు తిన్నారని మండిపడ్డారు. అమరావతిలో రాజధాని పేరిట 77 వేల ఎకరాలను సేకరించి రాజధానిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నారని ఆరోపించారు. రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు విడుదల చేస్తే 8 శాతం అంటే రూ.1200 కోట్లు కమీషన్ల రూపంలో కూటమి నేతలు దోచుకున్నారని ఆరోపించారు. ఇటీవల విశాఖపట్నంలో ఉర్సా భూ కుంభకోణం వెలుగుచూసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎకరా భూమిని, రూ.0. 99 పైసల చొప్పున 3 వేల ఎకరాలు అప్పనంగా కట్టబెట్టి రూ.వేల కోట్లు దోచుకున్నారని దుయ్యబట్టారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీల పథకాలను కూడా వదలకుండా రూ.170 కోట్లు దోచుకున్నారన్నారు. జిల్లాలో మద్యం మహమ్మారితో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడిందన్నారు. రోజుకొక హత్య జరుగుతుందన్నారు.జిల్లాలో నాలుగైదు నెలల్లోనే 25 హత్యలు జరిగాయన్నారు. మరో పక్క మైనింగ్ మాఫియా కూడా రెచ్చిపోతుందన్నారు. ఇసుక లారీని పట్టుకుంటే లక్ష రూపాయలు బహుమతి ఇస్తానన్న మంత్రికి టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి 3 లారీలను పట్టుకున్న విషయం తెలియదా? అని ప్రశ్నించారు.

ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజా హుస్సేని, రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మల, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, జంగం సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు వావిలేటి ప్రసన్న, కార్పొరేటర్లు కరిముల్లా, నీలి రాఘవరావు, కామాక్షిదేవి, జయలక్ష్మి, మాజీ ఏఎంసీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు అశ్రిత్‌రెడ్డి, యువజన విభాగం నాయకులు కిషన్, 11 డివిజన్ ఇన్‌చార్జి మహేష్ యాదవ్, 5వ డివిజన్ ఇన్‌చార్జి సుబ్బారెడ్డి, మైనార్టీ నాయకులు అబ్దుల్ మస్తాన్, యస్దాని తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లల్లో మరమ్మతులు వేగంగా పూర్తి చేయాలి

- నూరు శాతం సీట్లు భర్తీ చేయండి
- టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల్లో సంపూర్ణ ఉత్తీర్ణత సాధించాలి
- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో మరమ్మతు పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లాలోని హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, వార్డెన్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 64 హాస్టళ్లలో శ్లాబు, గోడల మరమ్మతులు, ఎలక్ట్రికల్, నీటి సరఫరా, కిటికీలు, తలుపులు తదితర అత్యవసర మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.9.32 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. పంచాయతీరాజ్ శాఖకు 34, ఆర్‌అండ్‌బీ శాఖకు 30 హాస్టళ్లను కేటాయించి త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. వేసవి సెలవుల అనంతరం విద్యార్థులందరూ హాస్టళ్లకు తిరిగి వచ్చేలోగా ఈ పనులన్ని పూర్తి కావాలని ఆదేశించారు.

నూరుశాతం సీట్లు భర్తీ చేయండి

అన్ని వసతులు కలిగి ఉన్న హాస్టళ్లలో నూరు శాతం అడ్మిషన్లు ఉండేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏఎస్‌డబ్ల్యూఓలకు సూచించారు. ఇందు కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో పని చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి ఎక్కువ మంది విద్యార్థులు హాస్టళ్లలో చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. సరైన వసతులు లేక తక్కువ విద్యార్థులున్న హాస్టళ్లను సమీపంలో మెరుగైన వసతులు కలిగి ఉన్న హాస్టళ్లను అనుసంధానించాలని సూచించారు. జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లకు ప్రభుత్వం నిర్దేశించిన 5,900 విద్యార్థుల సంఖ్యకు తక్కువ కాకుండా పూర్తి స్థాయిలో భర్తీ అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.

10వ తరగతి సప్లిమెంటరీలో మెరుగైన ఫలితాలు సాధించాలి

జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో ఈ ఏడాది సాధించిన 10వ తరగతి ఫలితాలపై కలెక్టర్ ఆనంద్ సమీక్షించారు. కొన్ని హాస్టళ్లలో తక్కువ ఉత్తీర్ణత శాతం ఉండడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు మొదలైన మొదటి నెల నుంచే విద్యార్థులపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ ఉంచాలని, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేయాలన్నారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులకు వారికి అర్థమయ్యేలా ముందు నుంచే మెరుగైన బోధన అందించడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చున్నారు. ఫెయిలైన విద్యార్థులందరూ టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఏఎస్‌డబ్ల్యూఓలకు సూచించారు. ట్యూషన్లు పెట్టి సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు జీ రామకృష్ణప్రసాద్, సుబ్బరాజు, హాస్టల్ సంక్షేమ అధికారులు, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీతో సహా చెల్లిస్తాం

- అక్రమ కేసులు పెడితే భయపడేది లేదు
- కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి (జలదంకి): కావలి నియోజకవర్గంలో ప్రజాపాలన గాలికి వదిలేసి, అక్రమార్జన కోసం గ్రావెల్, ఇసుక, రేషన్ బియ్యం మాఫియాలను నడిపిస్తున్న ఎమ్మెల్యే అరాచకపాలన మీద ప్రశ్నిస్తుంటే అక్రమ కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తున్నారని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. మీరు పెట్టే అక్రమ కేసులకు భయపడేది లేదని, మీకు వడ్డీతో సహా చెల్లిస్తామని తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నేతలు పలువురు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగళూరు నుంచి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేశామని, మారణాయుధాలతో దాడులకు పాల్పడ్డామంటూ నాతోపాటు మా నాయకులపై, ఏ పాపం ఎరుగని మీడియా ప్రతినిధుల మీద అక్రమ కేసులు పెట్టి కావలి ఎమ్మెల్యే రాక్షసానందం పొందుతున్నాడన్నారు. కట్టు కథ సూపర్‌గా ఉందన్నారు. పోలీసులను ఇలా కూడా వాడుకోవచ్చని పదేళ్లు అధికారంలో ఉన్న మాకు చేతకాలేదన్నారు. ఇప్పుడు అవన్నీ మాకు బాగా నేర్పిస్తున్నారని, బాగా నేర్చుకుంటామని చెప్పారు. మా అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు.. ఒక చెంపపై కొట్టండి.. దాన్ని మేము తిరిగి ఇస్తామని చెప్పారు. కొట్టండి.. కేసులు పెట్టండి.. అక్రమ అరెస్టులు చేయించండి.. అవి కూడా చాలకపోతే ఇంకా నాలుగు కేసులు కూడా పెట్టుకోండి.. భయపడేది లేదన్నారు. కావలిలో ఇటువంటి సంస్కృతి ఇంత వరకు లేదన్నారు. గతంలో కావలి నియోజకవర్గంలో ఎంతో మంది ఎమ్మెల్యేలుగా గెలిచి సేవలు అందించారన్నారు. కలికి యానాదిరెడ్డి నుంచి మాగుంట పార్వతమ్మ, ఒంటేరు వేణుగోపాల్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, నాతో సహా అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ఇటువంటి కక్షపూరితంగా కేసులు పెట్టి వేధించుకున్న చరిత్ర లేదన్నారు. జలదంకి మండల సంస్కృతిని కావలికి అప్పు తెచ్చుకుంటున్నామని, అవకాశం వచ్చినప్పుడు వాటిని అప్పును వడ్డీ సహా తప్పకుండా తీరుస్తామన్నారు. మా మీద కేసులు పెట్టినంత మాత్రాన భయపడేది లేదని, కేసులు పెట్టారు కాబట్టి ఎదుర్కొనేందుకు న్యాయపోరాటం చేస్తున్నామన్నారు. లేదంటే కచ్చితంగా అరెస్ట్ చేయాలంటే ఎస్పీ కానీ, డీఎస్పీ కానీ చెప్పండి చాలు. నేనే వచ్చి మీ ఎదుట లొంగిపోతానన్నారు. ప్రజలు అధికారం ఇచ్చింది అవినీతి, అక్రమాలు చేయమని కాదని, మంచి పరిపాలన అందించమని, అలా కాకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ జలదంకి మండలంలో చేసిన విష సంస్కృతిని కావలిలో చేస్తే ఊరుకునేది లేదన్నారు. మీడియా ప్రతినిధులకు అండగా నిలబడింది తామేనని, ఇప్పుడు స్వార్థంతో కొందరు ఎమ్మెల్యే వద్దకు చేరి వారు గతంలో ఏం చేశారో అందరికీ తెలుసన్నారు. మీడియా అనేది నిష్పక్షపాతంగా ఉండాలని కోరారు.

సైదాపురం పోలీసుల
అష్టదిగ్బంధం



సైదాపురం స్టేషన్ వద్ద ఆత్మకూరు సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు వాహనాలు

సైదాపురం: సైదాపురంలో అక్రమంగా నిర్వహిస్తున్న మైనింగ్‌పై ఆరోపణలు గుప్పిస్తూ.. మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో పోరుబాటకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో పోలీసులు మంగళవారం సైదాపురాన్ని అష్టదిగ్బంధం చేశారు. శ్రీనివాస పద్మావతి గని వద్ద అనిల్‌కుమార్ యాదవ్ మంగళవారం నిరసన వ్యక్తం చేయనున్నట్లు సమాచారం అందడంతో ఆత్మకూరు డీఎస్పీ అలర్ట్ అయ్యారు. ఆయన పర్యవేక్షణలో సుమారు 100 మంది వరకు పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశారు. దీంతో సైదాపురంలో ఉత్కంఠ నెలకొంది. సైదాపురం నుంచి శ్రీనివాస పద్మావతి గని వరకు అడుగడుగున పోలీసులు మోహరించారు. మహిళా సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఉత్కంఠ వాతావరణం ఏర్పడింది. తీరా మాజీమంత్రి రావడం లేదని సమాచారం అందడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

పారదర్శకంగా పౌర సేవలు

నెల్లూరు రూరల్: ప్రజలకు పౌర సేవలను పారదర్శకంగా అందించాలని సంబంధిత అధికారులకు జేసీ కె కార్తీక్ సూచించారు. మంగళవారం తిక్కన ప్రాంగణంలో రీ సర్వే, డిజిటలైజేషన్, నోషనల్ ఖాతాలు, నీటి తిరువా పన్ను వసూలు, సిటిజన్ సర్వీసెస్ తదితర రెవెన్యూ రికార్డులను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ సజావుగా చేపట్టాలన్నారు. ఆత్మకూరు డివిజన్‌లో మొత్తం 26,252 నోషనల్ ఖాతాలున్నాయని, వాటిలో 449 ఖాతాలను సాధారణ ఖాతాలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పన్ను చెల్లించకపోతే ఆయకట్టు విస్తీర్ణ కొలతల్లో తేడాలు వచ్చే అవకాశం ఉందని రైతులకు అవగాహన కలిగించాలన్నారు. డీఆర్‌ఓ ఉదయభాస్కర్‌రావు, ఆర్డీఓ పావని, సర్వే ఏడీ నాగశేఖర్ పాల్గొన్నారు.

మా మైనింగ్ పరిశ్రమను రాజకీయం చేయొద్దు

వెంకటగిరి రూరల్: 'మా మైనింగ్ పరిశ్రమను రాజకీయం చేయొద్దు' అని శ్రీకళ్యాణరామ కంపెనీ మేనేజింగ్ పార్టనర్ సర్వజ్ఞ యాచేంద్ర మంగళవారం కోరారు. శ్రీకల్యాణ రామ కంపెనీకి సైదాపురం మండలంలోని కలిచేడు, గోగుల బృందావనం గ్రామాల్లో రెండు మైనింగ్ గనులు ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1920–30 నుంచి నేటి వరకు ఆయా మైకా పరిశ్రమల్లో మైకా, క్వార్ట్జ్ ఫెల్స్‌ఫర్ క్వారీలను మచ్చలేని రికార్డులతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఐదో తరం కుటుంబ సభ్యులతో సహా క్వారీ కార్యకలాపాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నట్లు పేర్కొన్నారు. తమ కంపెనీలకు సంబంధించి మైనింగ్ పరిశ్రమను రాజకీయం చేయొద్దని కోరారు.

క్లుప్తంగా

పొలంలో పనిచేస్తూ..

• వడదెబ్బకు రైతు మృతి

కొడవలూరు: వడదెబ్బ కారణంగా రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గండవరం దర్గా దళితవాడలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గుర్రాల లింగయ్య (65) మంగళవారం పొలంలో పని చేస్తూ ఎండ వల్ల సొమ్మసిల్లి పడిపోయాడు. ఈ విషయాన్ని సమీపంలోని వారు కాస్త ఆలస్యంగా గుర్తించారు. అప్పటికే లింగయ్య చనిపోయినట్లు బంధువులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

మనుబోలు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కొలనకుదురు గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కొలనకుదురు ఎస్టీ కాలనీకి చెందిన ఈగా చినరాయుడు (25) కుటుంబ కలహాలతో కలత చెంది ఎలుకల మందు తిని తీవ్ర అనారోగ్యానికి లోనయ్యాడు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. చినరాయుడికి భార్య, రెండు నెలల వయసున్న పాప ఉన్నారు. పోలీసుల కేసు నమోదు చేశారు.

నేత్రదానం

చినరాయుడి నేత్రాలను దానం చేసేందుకు అతడి భార్య ముందుకొచ్చింది. గ్రామానికి చెందిన కసిరెడ్డి సునీల్‌రెడ్డి గిరిజన కుటుంబానికి అవగాహన కల్పించడంతో వారు చినరాయుడు నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. ఐ బ్యాంక్ టెక్నీషియన్ సునీల్ నేత్రాలను సేకరించారు.

అధికారుల హెచ్చరికలు పట్టించుకోకుండా..

• ప్రభుత్వ భూమిలో మళ్లీ కలప నరికివేత



ట్రాక్టర్‌లో కలప

దుత్తలూరు: మండలంలోని భైరవరం గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమంగా కలప నరుకుతున్న విషయమై సోమవారం రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేయగా వీఆర్వో వెళ్లి అడ్డుకున్నారు. అయితే అధికారుల హెచ్చరికలు మాకు లెక్కలేదంటూ మంగళవారం యథేచ్ఛగా కలపను నరికి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. దీంతో గ్రామస్తులు ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి వీఆర్వో, ఆర్ఐ కలప కొడుతున్న ప్రదేశానికి వెళ్లి అడ్డుకున్నారు. ఇప్పటికే రెండు రోజుల పాటు కొట్టిన కలపను ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకున్నారు. దీంతో కొందరు అధికారులు కూడా అక్రమార్కులకు వంత పాడుతున్నారనే ప్రచారం ఉంది. తహసీల్దార్ యనమల నాగరాజును వివరణ కోరగా పంచాయతీరాజ్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. గ్రీవెన్స్‌లో ఫిర్యాదు వచ్చింది కాబట్టి తాము స్పందించామన్నారు. ఇకపై ఆ భూమిలో చెట్లు నరికితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

జొన్నవాడలో బంగారం, వెండి, నగదు చోరీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ గ్రామంలో భారీ చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని అల్లం సుప్రజ, ఆమె కుమారుడు సోమవారం రాత్రి ఇంటి బయట నిద్రించారు. మంగళవారం తెల్లవారుజామున లేచి ఇంట్లో చూసేసరికి బీరువాలో ఉన్న 20 సవర్ల బంగారం, అర కిలో వెండి, రూ.లక్ష నగదు కనిపించలేదు. చోరీ జరిగిందని గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రియల్టర్ దారుణ హత్య

• నెల్లూరులో దారుణం
• విభిన్న కోణాల్లో కేసు దర్యాప్తు

నెల్లూరు(క్రైమ్): వ్యాపార లావాదేవీల్లో నెలకొన్న విభేదాలో.. పాతకక్షలో.. కారణమో తెలియదు గానీ రియల్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అతి కిరాతకంగా హత్య చేశారు. ఈ ఘటన నెల్లూరు నగరంలోని వెంకటరెడ్డినగర్‌లో జరిగింది. ఘటనా స్థలంలో క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లు పరిశీలించి ఆధారాలు సేకరించాయి. విభిన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం వారు వివరాలు వెల్లడించారు. ఉదయగిరి మండలం సర్వరాబాదు గ్రామానికి చెందిన గొల్లపల్లి చిన్నయ్య అలియాస్ చిన్నా అలియాస్ ఇస్సాక్ (40), వేణి దంపతులకు సాత్విక్, కార్తీక్, శాలిని అనే సంతానం ఉన్నారు. ప్రైవేట్ వెటర్నరీ అసిస్టెంట్‌తోపాటుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యాపార లావాదేవీల విషయంలో అదే మండలానికి చెందిన కొందరితో చిన్నయ్యకు విభేదాలున్నాయి. హైకోర్టులో కేసుల విచారణ సాగుతోంది. అదే క్రమంలో ఫైనాన్స్ వ్యాపార విషయంలోనూ పలువురితో గొడవలున్నాయి.

నాలుగేళ్లుగా స్నేహితుడి ఇంట్లో..

చిన్నయ్యకు ఉదయగిరి మండలం వెంకటరావుపల్లికి చెందిన రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్ ఎస్.ఓబుల్‌రాజు స్నేహితుడు. ఆయనకు నెల్లూరు నగరంలోని వెంకటరెడ్డినగర్ నాలుగో వీధిలో రెండు అంతస్తుల భవనం ఉంది. దీంతో చిన్నయ్య నాలుగేళ్లుగా ఆ ఇంట్లో రెండో అంతస్తులో ఉంటున్నాడు. మొదటి అంతస్తులో రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ కార్యాలయం ఏర్పాటు చేశాడు. స్నేహితుడితో కలిసి వ్యాపారం చేస్తున్నారు. ప్రతి శని, ఆదివారం ఉదయగిరిలోని గొల్లపాళెం వెళ్లి భార్య, పిల్లలతో గడిపి నెల్లూరుకు వచ్చేవాడు. రియల్ ఎస్టేట్ పనుల నిమిత్తం గత నెల 30వ తేదీ నుంచి చిన్నయ్య గొల్లపాళేనికి వెళ్లకుండా నెల్లూరులోనే ఉంటున్నాడు.

ఇంట్లోనే అతికిరాతకంగా..

చిన్నయ్య స్నేహితుడు ఎస్.వెంకటేశ్వర్లు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. వెంకటేశ్వర్లు సోమవారం చిన్నయ్య వద్దకు వచ్చాడు. ఇద్దరూ రాత్రి టిఫిన్ చేశారు. వెంకటేశ్వర్లు పడకగదిలో, చిన్నయ్య హాల్లోని సోఫాలో నిద్రపోయారు. మంగళవారం ఉదయం ఆరు గంటల సమయంలో వెంకటేశ్వర్లు నిద్ర లేచి హాల్లోకి వచ్చిచూడగా ముఖంపై కత్తిపోట్లతో రక్తపు మడుగులో చిన్నయ్య మృతిచెంది ఉండటాన్ని గమనించి పరుగులు తీస్తూ కింద పోర్షన్‌లో ఉంటున్న వారి వద్దకు వెళ్లాడు. చిన్నయ్యను ఎవరో చంపేశారని భోరున విలపించాడు. వారు వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలోనే వెంకటేశ్వర్లు బాధిత కుటుంబ సభ్యులకు జరిగిన విషయాన్ని ఫోన్ ద్వారా తెలియజేశాడు. నగర డీఎస్పీ పి.సింధుప్రియ, ఇన్‌స్పెక్టర్లు రోశయ్య, టీవీ సుబ్బారావులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వెంకటేశ్వర్లుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.



పోలీస్ జాగిలంతో తనిఖీలు, (ఇన్‌సెట్‌లో) చిన్నయ్య (ఫైల్)

డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం పరిశీలన

ఘటనా స్థలంలో క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. డాగ్ స్క్వాడ్ ఘటన జరిగిన ప్రాంతం నుంచి గాంధీనగర్ వైపుగా కొద్దిదూరం వరకు వెళ్లి తిరిగి వచ్చింది. చిన్నయ్య తండ్రి చిన్నబాల ఓబయ్యతోపాటు కుటుంబసభ్యులు, బంధువులు నెల్లూరుకు చేరుకున్నారు. చిన్నయ్య మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మార్చురీకి తరలించారు. పోలీసులు విభిన్న కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. మృతుడికి సొంత గ్రామంలో పలువురితో భూమికి సంబంధించిన విభేదాలున్నాయి. ఓ స్థలానికి సంబంధించి ఇతని ఫిర్యాదు వల్ల కొందరికి జైలుశిక్ష సైతం పడినట్లు సమాచారం. వ్యాపార లావాదేవీల్లోనూ పలువురితో విభేదాలున్నట్లు తెలుస్తోంది. వివాహేతర సంబంధం ఏమైనా ఉందా? ఇలా అన్ని కోణాల్లో పోలీసులు నెల్లూరు నగరంతోపాటు ఉదయగిరి మండలంలోనూ విచారిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి హత్య జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆరోజు రాత్రి సుమారు 11.40 గంటల ప్రాంతంలో కొందరు ఆ వీధిలో నుంచి గాంధీనగర్ వైపు పరుగులు తీస్తూ వెళ్లినట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ టీవీ ఫుటేజ్‌లు, సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు



మాట్లాడుతున్న చిన్నయ్య తండ్రి ఓబయ్య

• కాగా చిన్నయ్య తండ్రి చిన్నబాల ఓబయ్య మీడియాతో మాట్లాడుతూ భూ వివాదాల నేపథ్యంలో హత్య జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

ఉదయగిరిలో చర్చ

ఉదయగిరి: చిన్నయ్య దారుణ హత్యకు గురికావడం ఉదయగిరి పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. మృతుడు 2008లో పశుసంవర్ధక శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి పశువైద్యశాలలో అటెండర్‌గా చేరాడు. అక్కడ నాలుగేళ్లపాటు పనిచేశాడు. ఈ క్రమంలో గ్రామస్తులతో కొన్ని విభేదాలు తలెత్తాయి. దీంతో సీతారామపురం మండలం బసినేనిపల్లి పశువైద్యశాలకు మార్పించుకున్నాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా అక్కడే అటెండర్‌గా ఉన్నాడు. ఉదయగిరి ఎస్సై ఇంద్రసేనారెడ్డి మృతుడి గ్రామానికి వెళ్లి విచారించారు. ఆరునెలల క్రితం సొంతూరు సర్వరాబాదు నుంచి ఉదయగిరి పట్టణంలో భార్య, బిడ్డలతో కాపురం పెట్టినట్లు చెబుతున్నారు.

నగరంలో కలకలం

• ఆగని హత్యలు • నెలరోజుల వ్యవధిలో ఐదు ఘటనలు
• భయాందోళనలో ప్రజలు
• అధికార పార్టీ నేతల ద్వారా లొంగిపోతున్న నిందితులు



చిన్నయ్య మృతదేహం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరం రక్తసిక్తంగా మారుతోంది. వరుస హత్యలు, హత్యాయత్నాలతో జనం భీతిల్లుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న అభద్రతా భావంతో కాలం వెళ్లదీస్తున్నారు. నెలరోజుల వ్యవధిలో ఐదు హత్యలు చోటుచేసుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఒక్క వేదాయపాళెం పోలీసుస్టేషన్ పరిధిలోనే మూడు హత్యలు జరిగాయి. నేరాల కట్టడికి పోలీసులు తీసుకుంటున్న చర్యలు ఫలితాలు ఇవ్వడం లేదనే విమర్శలున్నాయి. దుండగులు యథేచ్ఛగా నేరాలకు పాల్పడుతూనే ఉన్నారు. కొంతకాలంగా పలు హత్య కేసుల్లో నిందితులు అధికార పార్టీ నేతల ద్వారా పోలీసుల వద్ద లొంగిపోతున్నారు. దీంతో వారిని ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల బుజబుజనెల్లూరులో జరిగిన మాబునీ అనే మహిళ హత్య కేసులో నిందితుడు సైతం కోర్టు ప్రాంగణంలో కొందరి ద్వారా పోలీసులకు లొంగిపోయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. పోలీసుల పట్ల నేరస్తుల్లో భయం సన్నగిల్లుతోందని తెలుస్తోంది. నెల్లూరు నగరానికి చెందిన కొందరు ఇతర జిల్లాల్లో సుపారీ హత్యలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో శాంతిభద్రతలు మరింత క్షీణించే అవకాశం లేకపోలేదు.

ఈ మధ్య కాలంలో..

• పాతకక్షల నేపథ్యంలో గతనెలలో కారు డ్రైవర్ వాసు దారుణ హత్యకు గురయ్యాడు. నిందితులు అతికిరాతకంగా కత్తులతో నరికి మృతదేహాన్ని చెత్తకుప్పలో కప్పెట్టారు.
• టిఫిన్ అంగడి వద్ద నెలకొన్న స్వల్ప వివాదంతో వేదాయపాళేనికి చెందిన అల్లాభక్షును రంగనాయకులపేటకు చెందిన ఇషాక్ కత్తితో పొడిచి హత్య చేశాడు.
• చంపేస్తాడన్న భయంతో జాకీర్‌హుస్సేన్‌నగర్‌కు చెందిన సుల్తాన్‌ను అదే ప్రాంతానికి చెందిన కలీమ్, నాగరాజు హత్య చేశారు.
• బుజబుజనెల్లూరు చెన్నకేశవుల నగర్‌కు చెందిన మాబునీని అదే ప్రాంతానికి చెందిన విజయ్ దారుణంగా చంపాడు.
• తాజాగా వెంకటరెడ్డినగర్ నాలుగో వీధిలో ఉదయగిరి మండలం సర్వరాబాదు గ్రామానికి చెందిన గొల్లపల్లి చిన్నయ్య అలియాస్ చిన్నా తన ఇంట్లోనే దారుణ హత్యకు గురయ్యాడు. పాతకక్షల నేపథ్యంలోనే హత్య జరిగినట్లు తెలుస్తోంది.

ఏంటి.. బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయా?

• నేటి నుంచి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు
• పోస్టర్లు, కరపత్రాలెక్కడ?
• దేవదాయ శాఖ నిర్లక్ష్యం

ఉలవపాడు: ఏడాదికొకసారి జరిగే ఉలవపాడులోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలకు నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి భక్తులు వస్తుంటారు. ఈ ఏడాది భక్తులకు కనీస సమాచారం లేదు. రథోత్సవం లేదని, ఆ స్థానంలో పూల రథోత్సవం నిర్వహిస్తామని ప్రకటించారు. అయితే దేవస్థాన మైక్ ద్వారా, దండోరా ద్వారా కానీ తెలియచేయని దుస్థితి. ఈ ఏడాది అంతా రహస్యమే. బహిరంగ పోస్టర్లు లేవు. కరపత్రాలు ఎన్ని కొట్టించారో, ఎవరికి పంపిణీ చేశారో తెలియదు. ఇలా దేవదాయ శాఖ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఉత్సవాలు జరుగుతున్నాయని గుడి దగ్గర పందిరి చూస్తే తప్ప తెలియని పరిస్థితి నెలకొంది.



నామమాత్రంగా వేసిన చలువ పందిళ్లు

నచ్చిన సమయంలో వచ్చి..

దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా సుమారు ఆరునెలల క్రితం వెలగం శ్రీనివాస్‌ను నియమించారు. ఈయన ఒంగోలులో నివాసం ఉంటారు. తనకు నచ్చిన సమయంలో గుడి వద్దకొచ్చి సిబ్బందిని పిలిచి నిర్ణయాలు తీసుకుంటారని ప్రచారం ఉంది. ఆయన వచ్చే సమయం చెప్తారని, ఆ సమయంలోనే బ్రహ్మోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన వారు వేచి ఉండాలని చెబుతున్నారు. మళ్లీ వచ్చినప్పుడే మిగిలిన నిర్ణయాలు జరుగుతాయి. రాజకీయ నాయకులకు చెప్తే చాలు, భక్తులకు అవసరం లేదనే విధంగా ఉన్నారని ఆరోపణలున్నాయి.

నామమాత్రంగా..

గతంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా పోస్టర్లు అంటించేవారు. ఈ ఏడాది అలా జరగలేదు. ప్రజాప్రతినిధులను కూడా పట్టించుకోలేదు. గతంలో దాదాపు 8 సాంస్కృతిక కార్యక్రమాలు జరిపేవారు. ఈ ఏడాది ఐదుతో సరిపెట్టారు. నాడు బస్టాండ్ సెంటర్‌లో కూడా విద్యుత్ కటౌట్లు ఏర్పాటు చేశారు. ఈసారి అవి లేవు. ఉన్న కార్యక్రమాలు కూడా భక్తులకు తెలియని పరిస్థితి.



మూసి ఉన్న దేవస్థానం కార్యాలయం

కార్యక్రమాలిలా..

బుధవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 9 గంటలకు అంకురార్పణ, 8న ధ్వజారోహణ, చప్పరసేవ, 9న హంస వాహనం, 10న సింహ వాహనం, 11న హనుమంతసేవ, 12న గరుడసేవ, 13న ఏనుగుసేవ, 14న కల్యాణం, పూల రథోత్సవం, 15న దొంగలదోపు తదితర కార్యక్రమాలు 17 వరకు జరుగుతాయి. 11 ,12, 13, 14 తేదీల్లో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.95
సన్నవి : రూ.50
పండ్లు : రూ.30

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 136
లేయర్ (లైవ్) : 105
బ్రాయిలర్ చికెన్ : 242
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 266
లేయర్ చికెన్ : 178

సినిమాలపై మక్కువతో..

• డైరెక్టర్‌గా మారిన రాజుపాళెం కుర్రోడు

మర్రిపాడు: మండలంలోని చుంచులూరు రాజుపాళెం గ్రామానికి చెందిన యల్లంరాజు మోహన్‌రాజు, ఉమారాణి దంపతుల కుమారుడు రాకేష్ వర్మ సినిమా డైరెక్టర్‌గా మారాడు. బ్లైండ్ స్పాట్ అనే సినిమాకు రచయితగా, దర్శకుడిగా వ్యవహరించాడు. ఇందులో నవీన్ చంద్ర, రాశీసింగ్ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారు. రామకృష్ణ వీరపనేని నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం తీశారు. ఈనెల 9వ తేదీన విడుదల కానుంది. ఇంజినీరింగ్ పూర్తి చేసిన రాకేష్ వర్మకు సినిమాలంటే ఇష్టం. దీంతో హైదరాబాద్‌లో ప్రముఖ దర్శకుడు ఉమామహేశ్వరరావు సారథ్యంలో దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో డైరెక్టర్‌గా శిక్షణ పొందాడు. అనంతరం పలు షార్ట్ ఫిల్మ్‌లకు దర్శకత్వం వహించాడు. వాటిలో పానీపూరి అనే షార్ట్ ఫిల్మ్‌కు జాతీయ స్థాయి అవార్డు వచ్చింది. రాకేష్ వర్మ దర్శకత్వం వహించిన తొలి చిత్రం విడుదలవుతున్న నేపథ్యంలో రాజుపాళెం, చుంచులూరు, పడమటినాయుడుపల్లి తదితర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బ్లైండ్ స్పాట్ సినిమా విడుదల సందర్భంగా మాట్లాడుతున్న రాకేష్ వర్మ

భూములు తిరిగివ్వండి

• లేదా ఉపాధి కల్పించండి


నెల్లూరు రూరల్: '1979లో మాకు కొంత అటవీ భూమి కేటాయించారు. మేము సాగు చేసుకుంటుంటే 2017లో పరిశ్రమల కోసం సేకరించి ఇప్పటి వరకు పట్టించుకోలేదు. భూములు తిరిగివ్వండి. లేదా ఉపాధి కల్పించండి' అని నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల గ్రామానికి చెందిన ఎస్సీ రైతు కూలీలు కోరారు. మంగళవారం నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాట్లాడుతూ 2017లో అప్పటి ఆర్డీఓ, తహసీల్దార్, వీఆర్వోలు కలిసి పరిశ్రమలు కట్టి ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని చెప్పారన్నారు. కొంత నష్ట పరిహారం చెల్లించి భూమిని స్వాధీనం చేసుకున్నారన్నారు. ఏళ్లు గడిచినా ఇప్పటి వరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదని, ఉపాధి కూడా కల్పించలేదన్నారు. తమ మా జీవనాధారం ఎలాగని ప్రశ్నించారు. గ్రీవెన్స్‌లో ఎన్నోసార్లు అర్జీలిచ్చినా పట్టించుకోలేదన్నారు. న్యాయం చేసి ఉపాధి కల్పించాలని, లేనిపక్షంలో భూమి తిరిగివ్వాలని కోరారు.



మాట్లాడుతున్న రైతు కూలీలు తదితరులు

కేన్సర్ నివారణపై వర్క్‌షాప్

నెల్లూరు(అర్బన్): నగరంలోని నారాయణ మెడికల్ కళాశాలలో కేన్సర్ నివారణపై రెండు రోజుల వర్క్‌షాపు మంగళవారంతో ముగిసింది. నారాయణ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొని మాట్లాడారు. కాలుష్యం లేని, కలుషితం కాని పోషకాహారం తీసుకోవడం ద్వారా పలు రకాల కేన్సర్‌లను నివారించవచ్చన్నారు. ఐసీఎంఆర్ నిధులు పొందిన నారాయణ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆంధ్రప్రదేశ్‌లో రెండోది కావడం గర్వకారణమన్నారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ వనజకుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ తేజోవతి, మెడికల్ కళాశాల కో-ఆర్డినేటర్ బిజూ రవీంద్రన్, ఆపరేషన్స్ హెడ్ రామారావు, అంకాలజిస్ట్ ఉషారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్లు